www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 2 మార్చి 2024
5
ఏలూరు

ప్రశాంతంగా టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్రమైన ఏలూరులో టెట్ పరీక్షలు శుక్రవారం నాల్గో రోజు ప్రశాంతంగా సాగాయి. సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్ కాలేజ్, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన పరీక్షల్లో ఉదయం పరీక్షకు 370 మంది హాజరు కావాల్సి ఉండగా 338 మంది హాజరయ్యారు. 32 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 370 మందికిగాను 343 మంది హాజరయ్యారు. 27 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డిఇఒ అబ్రహం తెలిపారు.

విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఓట్లు.. లెక్కలు..!

2019 ఎన్నికల్లో ఓట్ల ప్రాతిపదికగా గెలుపోటములపై అంచనాలు
15 స్థానాల్లో 13 చోట్ల వైసిపి గెలుపు - 46.35 శాతం ఓటింగ్
టిడిపి రెండు చోట్ల విజయం - 36.30 శాతం ఓటింగ్
జనసేనకు వచ్చిన ఓట్ల శాతం 11.68
2024 ఎన్నికల్లో గెలుపుపై ఎవరి ధీమా వారిదే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మరో రెండు వారాల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే వైసిపి జిల్లాలోని అన్ని స్థానాల్లో అభ్యర్థుల ఎంపికను పూర్తి చేసింది. టిడిపి, జనసేన ఏడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా మరో ఏడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల సరళిని బట్టి టిడిపి, జనసేన పొత్తుతో అత్యధిక స్థానాలను గెలుచుకుంటామని ఇరు పార్టీల నాయకులు అంచనా వేస్తుండగా, తాము అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు వైసిపిని గెలిపిస్తాయంటూ ఆ పార్టీ నాయకులు ధీమాగా ఉన్నారు. గత ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 15 అసెంబ్లీ స్థానాలు ఉండగా వాటిలో వైసిపి 13 చోట్ల గెలుపొందగా, టిడిపి పాలకొల్లు, ఉండి స్థానాల్లో మాత్రమే గెలుపొందింది. జనసేన ఒక్కచోట కూడా గెలుపును దక్కించుకోలేకపోయింది. గత ఎన్నికల్లో టిడిపి, జనసేన పొత్తు లేకుండా విడివిడిగా పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలైన ఓట్లు 82.44 శాతం. వీటిలో వైసిపికి 46.35 శాతం ఓట్లురాగా, టిడిపికి 36.30 శాతం, జనసేనకు 11.68 శాతం ఓట్లు వచ్చాయి. అత్యధిక ఓటింగ్ శాతం వచ్చిన వైసిపి అత్యధిక స్థానాలను సాధించింది. టిడిపి, జనసేన ఓటింగ్ కలిపితే 47.98 శాతంగా ఉంది. అంటే రెండు పార్టీలకు పోలైన ఓట్లు వైసిపి కంటే ఎక్కువగానే ఉన్నాయి. ఈ ప్రాతిపదికన టిడిపి, జనసేన నాయకులు రాబోయే ఎన్నికల్లో గెలుపోటములపై లెక్కలు కడుతున్నారు. గత ఎన్నికల నాటికి టిడిపి అధికార పార్టీగా ఉంది. దీంతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎక్కువగా వైసిపికి పడిందని, అయినప్పటికీ టిడిపి, జనసేన ఓట్లు వైసిపికంటే ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. ఈసారి పాలకపార్టీగా ఉన్న వైసిపి వ్యతిరేక ఓటు టిడిపి, జనసేనకు పడే అవకాశం ఉందని, దీంతో అత్యధిక స్థానాలు గెలుస్తామని ఆయా పార్టీల నేతలు చెబుతున్నారు.

> **జిల్లాలో ఎన్నికల వేడి తారాస్థాయికి చేరింది. రెండు రోజుల క్రితం తాడేపల్లిగూడెంలో జరిగిన టిడిపి, జనసేన ఉమ్మడి ఎన్నికల సభ తర్వాత వచ్చే ఎన్నికల్లో గెలుపోటములపై జిల్లా ప్రజానీకంలో చర్చ సాగుతోంది. గత ఎన్నికల్లో ఆయా పార్టీలకొచ్చిన ఓట్లు ఎన్ని అంటూ లెక్కలు కడుతున్నారు. అప్పటి ఓట్లు, ఇప్పుడు ప్రభుత్వ వ్యతిరేకతను అంచనా వేస్తూ గెలుపోటములపై అంచనాలు వేస్తున్నారు. దీంతో 2019 ఎన్నికల్లో ఓట్ల లెక్కలపై ప్రతిఒక్కరూ చర్చించుకోవడం కన్పిస్తోంది.**

2019 ఎన్నికల్లో టిడిపి, జనసేన కలిసి పోటీ చేసి ఉంటే..!

గడిచిన సాధారణ ఎన్నికల్లో టిడిపి, జనసేన వేర్వేరుగా పోటీ చేయడంతో అనేక స్థానాలు కోల్పోయామని, లేకపోతే జిల్లాలో సగం సీట్లకుపైగా గెలుచుకునే వారమని టిడిపి, జనసేన నాయకులు చెబుతున్నారు. గత ఎన్నికల్లో ఏలూరు నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థికి 72,247 ఓట్లురాగా, టిడిపికి 68,175 ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికల్లో జనసేన అభ్యర్థికి16,681 ఓట్లు వచ్చాయి. టిడిపి, జనసేన కలిసి పోటీ చేసి ఉంటే ఏలూరు స్థానం కైవసం చేసుకునేవారమని లెక్కలు కడుతున్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో వైసిపికి 70,741 ఓట్లురాగా, టిడిపికి 54,275 ఓట్లు వచ్చాయి. దీంతో 16,466 ఓట్లతో వైసిపి అభ్యర్థి గెలుపొందారు. ఆ ఎన్నికల్లో జనసేన అభ్యర్థికి 36,197 ఓట్లు వచ్చాయి. టిడిపి, జనసేన కలిసి పోటీచేసి ఉంటే గెలుపు ఖాయమై ఉండేదని విశ్లేషిస్తున్నారు. తణుకు నియోజకవర్గంలో వైసిపికి 75,978 ఓట్లురాగా, టిడిపికి 73,780 ఓట్లు లభించాయి. దీంతో 2,195 ఓట్లతో వైసిపి గెలిచింది. అదే నియోజకవర్గంలో జనసేన అభ్యర్థికి 31,691 ఓట్లు వచ్చాయి. రెండూ కలిసి పోటీచేసి ఉంటే తణుకు స్థానం గెలిచే వారమని టిడిపి, జనసేన నాయకులు చెబుతున్నారు. భీమవరం నియోజకవర్గంలో వైసిపికి 70,642 ఓట్లురాగా, జనసేనకు 62,285 ఓట్లు వచ్చాయి. వైసిపి అభ్యర్థి గెలిచారు. అదే నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థికి 50 వేలకు పైగా ఓట్లు వచ్చాయి. నరసాపురం నియోజకవర్గంలో వైసిపికి 55,556 ఓట్లురాగా, జనసేనకు 49,120 ఓట్లు వచ్చాయి. అక్కడ టిడిపికి 27,059 ఓట్లు వచ్చాయి. ఇక్కడ కూడా కలిసి పోటీ చేయని కారణంగానే ఓటమి పాలైనట్లు చెబుతున్నారు. కైకలూరులో వైసిపికి 82,128 ఓట్లురాగా, టిడిపికి 72,771 ఓట్లు వచ్చాయి. ఈ స్థానాన్ని వైసిపి గెలుచుకుంది. ఆ స్థానంలో జనసేన అభ్యర్థికి 10,738 ఓట్లు వచ్చాయి. కలిసి పోటీ చేసి ఉంటే గెలిచేవారమని లెక్కలు కడుతున్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో పొత్తుతో ముందుకు సాగుతుండటంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అత్యధికస్థానాలు గెలుచుకుంటామని టిడిపి, జనసేన నేతలు చెబుతున్నారు. సంక్షేమ పథకాలు తమ పార్టీని గెలిపిస్తాయని వైసిపి నాయకులు చెబుతున్నారు. ఏదేమైనా గత ఎన్నికల్లో జనసేన, సిపిఎం, సిపిఐ సీట్ల సర్దుబాటుతో పోటీ చేశాయి. ఉమ్మడి జిల్లాలో తాడేపల్లిగూడెం, భీమవరం, ఉండి, నరసాపురం తదితర నియోజకవర్గాల్లో వామపక్షాలకు ప్రధానంగా సిపిఎంకు ప్రజా పునాది బలంగా ఉంది. వామపక్షాల నుంచి ఓట్ల బదిలీ కూడా జనసేనకు సునాయాసంగానే సాగడంతో నరసాపురం, భీమవరం తదితర స్థానాల్లో వైసిపికి, టిడిపికి కూడా జనసేన అభ్యర్థులు ముచ్చెమటలు పట్టించారు. అయితే ఈ ఎన్నికల్లో పొత్తుతో బరిలోకి దిగుతున్న టిడిపి, జనసేన అభ్యర్థుల మధ్య ఓట్ల బదిలీ కీలకం కానుంది. ఓట్ల బదిలీ సక్రమంగా సాగితే గత ఎన్నికల ఓట్ల ఆధారంగా సాగే విశ్లేషణలు కార్యరూపం దాల్చే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లోనే అభ్యర్థుల ప్రకటన పూర్తిస్థాయిలో వెలువడనప్పటికీ పలు స్థానాల్లో గెలుపోటములపై పందేలు సాగుతుండటం విశేషం.

పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 101 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఏలూరు జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ బి.ప్రభాకరరావు, పశ్చిమగోదావరి జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. ఏలూరు జిల్లాలో 51 కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలకు మొత్తం 16,029 మందికి 15,275 మంది హాజరవ్వగా 754 మంది గైర్హాజరయ్యారు. 95 శాతం హాజరు నమోదైంది. దీనిలో సాధారణ విద్యార్థులు 13,798 మందికి 13,328 మంది హాజరవ్వగా 470 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో 2,231 మందికి 1,947 మంది హాజరవ్వగా 284 మంది గైర్హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో 50 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు మొత్తం 18,288 మందికిగాను 17,690 మంది హాజరయ్యారు. 638 మంది గైర్హాజరయ్యారు. వీరిలో సాధారణ విద్యార్థులు 16,444 మందికి 16,014 మంది హాజరవ్వగా 430 మంది గైర్హాజరయ్యారు. అలాగే వృత్తి విద్య విభాగంలో 1,884 మందికి 1,676 మంది హాజరవ్వగా 208 మంది గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ పరీక్షా కేంద్రాలను సందర్శించిన జిల్లా పరీక్షల కమిటీల కన్వీనర్లు ప్రభాకరరావు, చంద్రశేఖర్‌బాబు మాట్లాడుతూ అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు వాటిని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశామన్నారు. ప్రతిరోజూ విద్యార్థులు ఎలాంటి గందరగోళానికి గురికాకుండా ఒక గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

రూ.26.42 కోట్లు విద్యాదీవెన నిధుల విడుదల

32,452 మంది విద్యార్థులకు లబ్ధి : కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జగనన్న విద్యా దీవెన పథకం కింద అక్టోబరు- నవంబరు 2023 త్రైమాసికానికి సంబంధించి 32,452 మంది విద్యార్థులకు సంబంధించి వారి తల్లులు, విద్యార్థుల జాయింట్ బ్యాంక్ ఖాతాలకు రూ.26.42 కోట్లు నిధులు జమ చేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రులో నిర్వహించిన జగనన్న విద్యాదీవెన కార్యక్రమంలో కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా తల్లులు, విద్యార్థుల జాయింట్ ఖాతాల్లో డబ్బు జమ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, సోషల్ వెల్ఫేర్ జెడి జయప్రకాష్, జిల్లా బిసి సంక్షేమాధికారి ఆర్‌వి.నాగరాణి, మైనారిటీ సంక్షేమాధికారి శ్రీనివాసరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నమూనా చెక్కును అందజేశారు. అనంతరం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో 8,052 ఎస్‌సి విద్యార్థులకుగాను రూ.6.15 కోట్లు, ఎస్‌టి విద్యార్థులు 1,478 మందికి రూ.79 లక్షలు, బిసి విద్యార్థులు 14,835 మందికి రూ.12.13 కోట్లు, ఇబిసి విద్యార్థులు 2,728 మందికి రూ.2.79 కోట్లు, ముస్లిం మైనారిటీ విద్యార్థులు 852 మందికి రూ.74 లక్షలు, కాపు విద్యార్థులు 4,137 మందికి రూ.3.35 కోట్లు, క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులు 370 మందికి రూ.29 లక్షలు మొత్తం 32,452 మంది విద్యార్థులు, 29,281 మంది తల్లులకు చెందిన ఉమ్మడి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము ప్రభుత్వం జమ చేసిందన్నారు.



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - నిడమర్రు

తమకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణరావు ప్రారంభించారు. సంఘం నేత చిలిమిల్లి రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రమణరావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. 1214 మెమోను. రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను నిర్మాణ కార్మికుల కుటుంబాలకు మాత్రమే ఖర్చు పెట్టాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ దాన్ని అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చట్టవిరుద్ధంగా రూ.1250 కోట్లను దొడ్డిదారిన దారి మళ్లించిందని. ఆ నిధులను సంక్షేమ బోర్డుకు జమ చేసి ప్రభుత్వం ఆపేసిన సంక్షేమ బోర్డును పునరుద్దరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వం చంద్రన్న బీమా పేరుతో నిధులు మళ్లిస్తే కార్మికుల ఆగ్రహానికి గురై అధికారం కోల్పోయిందని గుర్తు చేశారు. తక్షణం నిధులు వెనక్కి జమ చేయకపోతే వైసిపి ప్రభుత్వానికీ ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం తీరు మార్చుకుని భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ శేఖర్‌బాబుకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో దూషనపూడి పాండు, కంచ వరప్రసాద్, కానూరు శ్రీను, రోకలి ఏసురెడ్డి, కమిలి నాని, పెరికిల శ్రీను, కోన శ్రీనివాసరావు, కానూరు రాజు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం తహశీల్దార్ రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శుక్ల బోయిన రాంబాబు మాట్లాడారు.

జీలుగుమిల్లి: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు సిహెచ్.కొండలరావు మాట్లాడగా నేతలు కొత్తపల్లి కుటుంబరావు, మొడియం రమేష్, ముంగమూరి రాజు, పల్లంటి రాంబాబు, భాషా తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం నేత తహశీల్దార్ కట్టా శివయ్యకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నేతలు గుత్తికొండ వెంకట కృష్ణారావు, సీరా అప్పారావు, వినోద్‌కుమార్‌రాజు, సోమేశ్వరరావు, నవీన్, షేక్ బాబావలీ, జానీ తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రులో మాట్లాడుతున్న నారపల్లి రమణరావు

లారీ ఢీకొని డిగ్రీ విద్యార్థిని దుర్మరణం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కళాశాలకు మోటారు సైకిల్‌పై వెళుతుండగా లారీ ఢీకొని డిగ్రీ విద్యార్థిని మృతి చెందిన ఘటన పెదవేగి మండలం వంగూరు అడ్డరోడ్డు సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెదవేగి మండలం బి.సింగవరం గ్రామానికి చెందిన పలగాని లావణ్య (19) ఏలూరులోని ఎన్ఆర్ఐ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై స్నేహితునితో కలిసి కళాశాలకు బయలుదేరింది. వంగూరు అడ్డరోడ్డు సమీపంలోకొచ్చేసరికి ఎఫ్‌సిఐ గోడౌన్స్ వైపు మలుపు తిరుగుతున్న లారీని లావణ్య నడుపుతున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది. ఈ ఘటనలో లావణ్య అక్కడికక్కడే మృతి చెందగా స్నేహితునికి గాయలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. లావణ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పెదవేగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతురాలు లావణ్య

ఉపాధిహామీ చట్టాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధిహామీ చట్టాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ముసునూరు మండల ఎంపిడిఒ చాగంటి పద్మావతిదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని ముసునూరు గ్రామంలో ఫిడర్ ఛానల్‌లో జరుగుతున్న పనులను ఎపిఒ టి.రోజ్‌లీలాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టంలో పనికి వచ్చేవారు తప్పని సరిగా వందరోజుల పని దినాలు పూర్తి చేసుకోవాలని, పని ప్రదేశంలో క్వాలిటీ వర్క్ పని చూపించాలన్నారు. అదేవిధంగా పని ప్రదేశంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌లతో పాటు టెక్నికల్ అసిస్టెంట్‌లు కూడా పరిశీలన చేస్తుండాలని తెలిపారు.

పనులు పరిశీలిస్తున్న ఎపిఒ

ఓటు హక్కుపై అవగాహనా ర్యాలీ

కుక్కునూరు : మండలంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహశీల్దార్ అచ్చుతకుమారి తెలిపారు. రెవిన్యూ తరపునుంచి 85 శాతం మంది ఓటర్లు నమోదు చేయించామని, 95 శాతం నమోదు చేయించే దిశగా పోలింగ్ బూత్ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సైకోర్టల్ అధికారి శేషగిరిరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వీరాస్వామి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దు కోరుతూ న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - భీమడోలు

ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) పిలుపు మేరకు భూహక్కు చట్టం రద్దు కోరుతూ చేపట్టిన పోస్టుకార్డుల ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.రాజారావు తెలిపారు. చట్టం రద్దు కోరుతూ భీమడోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం భీమడోలు కోర్టుకు చెందిన న్యాయవాదులు విధులను బహిష్కరించారు. నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ భూహక్కు చట్టం రద్దు కోరుతూ భీమడోలు కోర్టుకు చెందిన న్యాయవాదులు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి పోస్టుకార్డులను పంపే కార్యక్రమం కొనసాగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో భీమడోలు బార్ అసోసియేషన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు కాలి నాగేశ్వరరావు, జివి.ప్రసాద్‌బాబు, సభ్యులు విజయరాజు, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

పోస్టుకార్డుల ఉద్యమం ప్రారంభించిన న్యాయవాదులు

గిరిజన సంక్షేమ హాస్టల్ సిబ్బందిపై చర్యలు

జీలుగుమిల్లి :జీలుగుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర వసతి గృహంలో గత నెల 18న కలుషిత ఆహారం తిని 40 మంది విద్యార్థులకుపైగా అస్వస్థతకు గురవడానికి కారణమైన సిబ్బందిపై ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి పివిఎస్.నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఘటనకు పూర్తి బాధ్యుడైన హాస్టల్ వార్డెన్ కొర్స నవీన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజుపై వచ్చిన ఆరోపణలపై విచారణకు ఆదేశిస్తూ, నివేదిక వచ్చాక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. వసతిగృహాలపై పర్యవేక్షణలో అలసత్వం వహించిన ఎటిడబ్ల్యుఒ కృష్ణమోహన్‌పై క్రమశిక్షణా చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. వసతిగృహనికి ఆహార పదార్థాలను అందించే కాంట్రాక్టర్ కె.రాజుకు కూడా నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

7,773 చేర్పులు, తొలగింపుల దరఖాస్తులు పరిష్కారం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో గత వారం రోజుల్లో ఓటరు చేర్పులు, మార్పులు, తొలగింపులకు సంబంధించి 7,773 దరఖాస్తులు పరిష్కరించామని, మరో 3752 పరిష్కార దశలో ఉన్నాయని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు తెలిపారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి శుక్రవారం జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లాలోని వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులైన జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, నూజివీడు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒలు వై.భవానిశంకరి, కె.అద్దయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.ముక్కంటి, కె.భాస్కర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.కాశీవిశ్వేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో తీసుకున్న చర్యలపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వివరించారు. ఓటర్ల జాబితాపై మీడియాలో 30 అంశాలురాగా వాటిపై చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో 1743 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ఎఇఆర్‌ఒ, ఎస్‌హెచ్‌ఒ, సెక్టార్ ఆఫీసర్లతో పరిశీలించాలని చెప్పామని, కొత్త తహశీల్దార్లు వచ్చినందున వారినీ పరిశీలించాలని ఆదేశించామని తెలిపారు. రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఈ నెల 2న సెక్టార్ ఆఫీసర్లకు, 4న ఎన్నికల వ్యయ మోనటరింగ్ కమిటీలకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎపిక్ కార్డుల ముద్రణ, పంపిణీ స్థితి తదితర అంశాలను కలెక్టర్ వివరించారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

చదువుతోనే మహిళా సాధికారత

నారాయణపురంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం
ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సినీ నేపథ్య గాయని సునీత

ప్రజాశక్తి - ఉంగుటూరు

చదువు ద్వారా మహిళలు స్వతంత్ర నిర్ణయాలతో అభివృద్ధి చెందితేనే మహిళా సాధికారత అని ప్రముఖ సినీ నేపథ్య గాయని సునీత అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం మార్చి 8వ తేదీ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ చేబ్రోలు ఆధ్వర్యంలో మండలంలోని నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి సునీత ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సభకు లయన్స్ క్లబ్ ఉమెన్ ఎంపైర్‌మెంట్ డిస్ట్రిక్ ఛైర్‌పర్సన్ శరణాల మాలతీరాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సినీ నేపథ్య గాయని సునీత మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ పురుషులతో పాటు మహిళలు సమానంగా రాణిస్తున్నారన్నారు. మహిళలు విద్య, స్కిల్ డవలప్‌మెంట్, నచ్చిన రంగాల్లో రాణించాలంటే ముఖ్యంగా తల్లి ప్రోత్సాహం ఎనలేనిదని తల్లులందరూ మంచివారని చెప్పారు. సెలబ్రిటీలు, రాజకీయ నాయకులపై వచ్చే ట్రోల్స్ సర్వ సాధారణంగా మారిపోతున్నాయని, సోషల్ మీడియా ప్రభావం ఉందన్నారు. అలాంటి ట్రోల్స్‌ను నేపప్పుడూ పట్టించుకోనని, నచ్చిన రంగంలో రాణించేందుకు మరింత పట్టు సాధించడంపైనే నాదృష్టి ఉంటుందన్నారు. అనంతరం ప్రేక్షకుల అభ్యర్ధన మేరకు ఆమె మూడు పాటలు పాడి అందరినీ అలరించారు. తొలుత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాలతీరాణి సమకూర్చిన చీరలు, విద్యార్థులకు విద్యాసామగ్రి, మహిళలకు క్యాన్సర్ రహిత సానిటరీ వస్తువులను సునీత చేతుల మీదుగా పంపిణీ చేశారు. సునీతను చూసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో లయన్స్ ఆడిటోరియం కిక్కిరిసిపోయింది. విశ్రాంత స్పెషల్ ఫోర్స్ కామాండో దిడ్ల శ్రీను జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఎవరెస్టు శిఖరం అధిరోహిత గొట్టుముక్కల విజయలక్ష్మి నారాయణపురం, చేబ్రోలు, ఉంగుటూరు సర్పంచులు దిడ్ల అలకనంద, రాంధే లక్ష్మీ సునీత, బండారు సింధును సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, హ్యాండీక్రాఫ్ట్ ప్రమోషన్ అధికారిణి సువర్చల , లయన్స్ క్లబ్ ఆఫ్ చేబ్రోలు అధ్యక్షురాలు అడపా శోభారాణి, రైల్వే ప్రయాణీకుల సౌకర్యాల బోర్డు సభ్యురాలు బి.నిర్మలాదేవి, లయన్స్, మానవత సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



సింగర్ సునీతను సత్కరిస్తున్న లయన్స్ సభ్యులు

నేడు పాక్సో అమలుపై అవగాహనా సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

పొక్సో చట్టం అమలు, బాధితులకు సహాయక చర్యలు, ఎన్‌డిపిఎస్ చట్టం, అత్యాచారం, ఇతర నేరాల్లో బాధిత మహిళలకు సహాయం, నల్సా సహాయ పథకం తదితర అంశాలపై ఈ నెల 2వ తేదీ శనివారం ఏలూరులో అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో జరిగే ఈ కార్యక్రమంలో ఏలూరులోని ఎస్‌పి కార్యాలయంలోని సమావేశపు హాలులో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కలిదిండి : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు ఏ సంక్షేమ పథకము అమలు చేయకుండా వైసిపి ప్రభుత్వము మొండి చెయ్యి చూపించున్నారు. 12, 14 మెమోను రద్దుచేయాలని, భవన నిర్మాణాల వద్ద పనులు చేస్తూ ఒక శాతం సెస్‌ను నిర్మాణ కార్మిక కుటుంబాలకు ఖర్చు చేయాలని, దారి మళ్లించిన రూ.1,150 కోట్లను సంక్షేమ బోర్డుకు జమచేయాలని పలు డిమాండ్లతో కూడిన వినతిని తహశీల్దార్ కార్యాలయంలో అందజేశారు. శేషు మహంకాళిరావు, పరసా రాజేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

ముదినేపల్లి: ఆరోగ్యశ్రీ కార్డులు త్వరితగతిన వైద్య సిబ్బంది పంపిణీ చేయాలని డిఎంహెచ్‌ఒ కెవి.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని పెదపాలపర్రు, వడాలి, ముదినేపల్లి గ్రామ సచివాలయాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇకెవైసి, ఫోటోమిస్సింగ్ తదితర విషయాలపై సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు, వైద్య సిబ్బందికి, సచివాలయ ఉద్యోగులకు, వాలంటీర్లకు దిశ నిర్దేశం చేశారు. వేగవంతంగా ఆరోగ్యశ్రీ కార్డులు లబ్ధిదారులకు నూరుశాతం పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.రమణ బాబు, సీనియర్ అసిస్టెంట్ ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

691 మందికి పింఛన్లు పంపిణీ

చాట్రాయి: గ్రామంలో 691 మంది పెన్షన్ దారులకు ప్రతినెల రూ.20 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయడం జరుగుతుందని గ్రామ సర్పంచి దామెర ఉష అన్నారు. మండల కేంద్రమైన చాట్రాయిలో శుక్రవారం గ్రామ సర్పంచి దామెర ఉష వాలంటీర్లతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ వృద్ధాప్య, వికలాంగ, వితంతు పెన్షన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్ని సంక్షేమ పథకాలు, పెన్షన్లు అందాలంటే మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు సంకు శివకుమారి, వైసిపి నాయకులు దామెర ప్రసాద్ బాబు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

జంగారెడ్డిగూడెం టౌన్ : 20 సంవత్సరాలు పైబడి ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదని, అలాంటి రోడ్డును మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుల సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని 7వ సచివాలయం, 20వ వార్డులో అశ్వరావుపేట రోడ్డు పప్పుల కొండయ్య మిల్లు వీధిలో జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి ఆదేశాల మేరకు రూ.13 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ప్రారంభోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం చిటికెల అచ్యుతరామయ్య, స్థానిక కౌన్సిలర్ కటారి వాసు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

మండవల్లి : భవిష్యత్తులో ఆర్థికంగా, స్థిరంగా ఉండేందుకు విద్యార్థి దశనుంచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు స్పష్టం చేశారు. మండలంలోని లోకుమూడి గరువు వికాస్ డిగ్రీ కాలేజీలో సెంటర్ ఫర్ ఫైనాన్స్ లిటరసీ ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు ఆర్థికంగా, స్థిరంగా ఉండేందుకు పొదుపు ఒక మంచి మార్గం అని అన్నారు. అనంతరం ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగించే కరపత్రాలను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్ భాస్కరరావు, వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ జి.రాజశ్రీ, సిఎఫ్ఎల్ కౌన్సిలర్ పి.రాధ,ప్రిన్సిపల్ టివి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు అర్బన్:ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తలసేమియా కేంద్రంలో 9 మంది తలసేమియా బాధిత చిన్నారులకు శుక్రవారం రక్తమార్పిడిని నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రానున్నది వేసవికాలం కనుక బ్లడ్ సెంటర్లలో రక్త కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. కాబట్టి ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి తలసేమియా చిన్నారులను ఆదుకోవాలని కోరారు. తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు 25 మందికి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మానవత సభ్యులు ఎంబి.శంకర రావు భోజనం ఏర్పాట్లు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ పిఎఆర్ఎస్.శ్రీనివాస్, రెడ్ క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి

టి.నరసాపురం: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తూ, విజయం సాధించడంలో ఎఐటియుసి కీలక పాత్ర పోషిస్తుందని ఎఐటియుసి చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షుడు టివిఎస్.రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని మక్కినవారిగూడెంలో ముఠా వర్కర్స్ యూనియన్ సమావేశం యూనియన్ అధ్యక్షులు మల్లెల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన టివిఎస్ రాజు మాట్లాడుతూ ఇటీవల కాలంలో మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశలు చేసిన సమ్మెకు ఎఐటియుసి అండగా నిలిచిందన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి అసంఘటిత కార్మికులను ఆదుకోవాలని తెలియజేశారు. ఈ సమావేశంలో యూనియన్ కార్యదర్శి కొప్పుల సతీష్, ఉపాధ్యక్షులు బైగాని ఏకాంబరం, కోశాధికారి ముసునూరి కృష్ణ పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం

జీలుగుమిల్లి: పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేసినట్లు సర్పంచి సున్నం ఉషారాణి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దర్భగూడెం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎంపిడిఒ కెఎమ్.మంగతాయారుతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం కోసమే ప్రభుత్వం ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేసిందని, ఈ శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు సున్నం సురేష్, కంచర్ల సుధారాణి, ఇఒపిఆర్‌డి నిఖిల్ మధుశరణ్ పాల్గొన్నారు.

మీటర్ రీడర్స్‌కు పని దినాలు కల్పించాలి

ఏలూరు అర్బన్: విద్యుత్ శాఖలో మీటర్ రీడర్స్‌గా పని చేస్తున్న వారికి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం పని దినాలు అమలు చేయాలని, ఎస్కో ఎకౌంటు ఓపెన్ చేయాలని కోరుతూ ఎఐటియుసి అనుబంధ మీటర్ రీడర్స్ యూనియన్ శుక్రవారం ఎపి ఇపిడిసిఎల్ ఎస్ఇకి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు ఒ.శ్రీనివాసరావు, కోశాధికారి మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నతాధికారులు మీటర్ రీడర్స్‌కి ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

నేరాలు - ఘోరాలు

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెలగపాడు గ్రామానికి చెందిన గుడిదల చిన్న గురవయ్య కడుపునొప్పిని తట్టుకోలేక ఫిబ్రవరి 29వ తేదీన మధ్యాహ్నం పురుగుమందు తాగాడన్నారు. వెంటనే స్థానికులు అతనిని జంగారెడ్డిగూడెం ప్రయివేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా, చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు మృతుని కుమారుడు గుడుదల భీమయ్య ఫిర్యాదుతో ఎస్ఐ డి.దుర్గా మహేశ్వర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి విక్రేతలు అరెస్టు

ముసునూరు: అక్రమంగా గంజాయి అమ్ముతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు. మండలంలోని చిల్లపోయినపల్లి గ్రామం దాటిన తర్వాత కొప్పాక వెళ్లే రోడ్‌లో గంజాయి పట్టుకోవడం జరిగిందన్నారు. ఎస్పి డి.మేరీ ప్రశాంతి, నూజివీడు డిఎస్పి లక్ష్మయ్య, రూరల్ సిఐ రామకృష్ణ ఆదేశాల మేరకు గంజాయి అమ్మే వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే గంజాయి వాడేవారిపై దాడి చేసి పట్టుకుని ఆ ముగ్గురు యువకులు ఒక బైక్, రెండు కేజీలు గంజాయి వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - భీమడోలు

మండలానికి కేటాయించిన రెండు ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల్లో శుక్రవారం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. భీమడోలు శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 179 మంది, పోలసానిపల్లి బాలయోగి గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో 223 మంది పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ ఆ పరీక్షా కేంద్రాలు భీమడోలుకు సమీపంలోని ఇతర మండలాలకు చెందిన పలు ప్రయివేటు, ప్రభుత్వ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు ప్రత్యేకించడంతో వారు అక్కడ నుంచి భీమడోలు చేరుకునేందుకు కొంతమేరకు ఇబ్బంది పడ్డారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించం అనే నిబంధన వల్ల పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకునేందుకు విద్యార్థులకు ఇతర ఏర్పాట్లు చేసుకోవాల్సి వచ్చింది. పరీక్షా కేంద్రానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆర్‌టిసి బస్సు శ్రీవెంకటేశ్వర కాలేజీకి చేరుకుంది. ఈ సౌకర్యం అన్ని ప్రాంతాల్లో అందుబాటులో లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

పరీక్షకు హాజరైన వికలాంగ విద్యార్థి

కుక్కునూరు : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు తొలి రోజు పోలీసుల పర్యవేక్షణలో ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 143 మంది విద్యార్థులకు గాను 116 మంది పరీక్షకు హాజరు కాగా 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద సిఐ శ్రీనివాస రావు, ఎస్ఐ రామకృష్ణలతో పాటు పోలీస్ సిబ్బంది గట్టిగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలవరం: విద్యార్థులను చెక్ చేస్తున్న పోలీసు సిబ్బంది

జీలుగుమిల్లి: మండల వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయగా బర్రింకలపాడు గిరిజన గురుకుల జూనియర్ కళాశాల, డిఎస్ఆర్ ఒకేషనల్ కళాశాల నుంచి మొత్తం 183 మంది విద్యార్థులకు గాను 158 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపల్ సతీష్ తెలిపారు. 25 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన అన్నారు. పరీక్ష కేంద్రంలో ఎటువంటి మాస్ కాపీయింగ్ లేకుండా పటిష్ట భద్రతను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

పోలవరం: మండలంలోని పోలవరం జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు మొదటిరోజు ప్రశాంత వాతావరణంలో జరిగాయని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులు 40 మంది పరీక్ష రాయవలసి ఉండగా అందులో 24 మంది విద్యార్థినులు, 12 మంది విద్యార్థులు మొత్తం 36 మంది విద్యార్థులు మొదటిరోజు పరీక్షకు హాజరైనట్లు , 4 విద్యార్థులు హాజరు కానట్లు తెలియజేశారు.

చింతలపూడి : మండలంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. చింతలపూడి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆర్యన్ జూనియర్ కళాశాల, రెండు పరీక్ష కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 470 మంది విద్యార్థులకు 411 మంది విద్యార్థులు హాజరయ్యారు. 59 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆర్యన్ జూనియర్ కళాశాలలో 389 విద్యార్థులకు, 361 మంది విద్యార్థులు హాజరైనారు, 28 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

ముదినేపల్లి: ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. శుక్రవారం విద్యార్థులకు తెలుగు, సాంస్క్రిట్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 129 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, ఏడుగురు గైర్హాజరయ్యారు. 122 మంది మాత్రమే పరీక్షకు హాజరైనట్లు డిపార్ట్మెంటల్ ఆఫీసర్ కెవి.నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు



ఏలూరులో పరీక్షలను పరిశీలిస్తున్న డిఇసి కన్వీనర్ ప్రభాకర్‌రావు

పరీక్ష జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఎస్ఐ డి.వెంకట్ కుమార్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు.

నూజివీడురూరల్ : నూజివీడు పట్టణంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీశారద కళాశాల, శ్రీసిద్ధార్థ కళాశాల, సెయింట్ ఆన్స్ కళాశాల, వాగ్దేవి కళాశాలతు పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. పరీక్షలు రాసే విద్యార్థులందరూ ఉదయం 8:30 నిమిషాలకు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. వారిని తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు.

కలిదిండి : ఇంటర్ ప్రథమ సంవత్సర తెలుగు పరీక్షకు 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నంబూరి గోపాల కృష్ణంరాజు తెలిపారు. కోరుకొల్లు, కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు తొలిరోజు 94 మంది విద్యార్థులకు గాను 85 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

కుక్కునూరు : పరీక్షా కేంద్రం వద్ద పోలీసు సిబ్బంది

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

గ్రామీణ నీటి సరఫరా సంస్థ సహాయ ఇంజినీర్ కె.రామారావు

ప్రజాశక్తి - భీమడోలు

రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని మండల పరిధిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయనున్నట్లు గ్రామీణ నీటి సరఫరా సంస్థ భీమడోలు సహాయ ఇంజనీర్ కె.రామారావు తెలిపారు. దీనిలో భాగంగా మండలంలోని 63,118 మందికి తల ఒక్కింటికి 55 లీటర్లకు తగ్గకుండా రక్షిత నీరు అందించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. మండలంలో 37 ఆవాస ప్రాంతాలు ఉన్నాయన్నారు. దీనిలో భాగంగా ఐదు రక్షిత నీటి సరఫరా పథకం కార్యక్రమాల ద్వారా సరఫరా అవుతున్న నీటిని 47 ఫిల్టర్ బెడ్‌ల సహకారంతో శుద్ధిచేసి తాగునీటిగా అందిస్తున్నామన్నారు. ఇదే క్రమంలో మండల పరిధిలోని గోదావరి జలాలను అవి అందుబాటులో ఉన్న 8 గ్రామాలకు అందజేస్తున్నామన్నారు. మిగిలిన 17 గ్రామాలకు భూగర్భ జలాలను బోర్ల ద్వారా అందజేస్తున్నట్లు తెలియజేశారు. దీనికి అదనంగా సమగ్ర మంచినీటి పథకం ద్వారా గోదావరి జలాలను తాగునీటిగా భీమడోలు, గుండుగొలను గ్రామాలకు అందజేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం ఆ ప్రాంతాల్లో 1.50 లక్షల లీటర్ల సామర్థ్యం గల ప్రత్యేక ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేప ట్టామన్నారు.

మరమ్మతులు చేస్తున్న తాగునీటి పథకం ఫిల్టర్ బెడ్

మండలంలోని ఫిల్టర్ బెడ్లను బాగు చేసే క్రమంలో ఆగడాల లంకలోని నాలుగు ఫిల్టర్ బెడ్ల మినహా ఇతర ప్రాంతాల్లో గల ఫిల్టర్ బెడ్లను శుభ్రం చేసే కార్యక్రమం పూర్తి చేసామన్నారు. ప్రస్తుతం ఆగడాల లంకలో రూ.11 లక్షల ఎంపిపి నిధులతో శుభ్రం చేసే కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. జల జీవన్ మిషన్ నిధులతో అంబరుపేట, పొలసానిపల్లి, కోడూరుపాడు, సూరప్పగూడెం, కోరుకొల్లు గ్రామాల్లో పైపులైన్లు వేసే కార్యక్రమం పూర్తి చేసామన్నారు. భీమడోలులో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు పూర్తి కావలసి ఉందన్నారు. మండలంలోని 30 తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపే కార్యక్రమాన్ని పూర్తి చేసామన్నారు. కాలువలను కట్టి వేసే లోగా మరొక మారు పూర్తిస్థాయిలో చెరువులను నింపి వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆ తర్వాత క్రమంలో కాలువలకు నీరు తిరిగి విడుదలయ్యే సమయాన్ని దష్టిలో ఉంచుకొని తరచుగా నీటి ఎద్దడి తలెత్తే గ్రామాలకు తాగునీటి రవాణా కోసం ప్రణాళికలను తయారు చేయవలసి ఉందని తెలిపారు.

జగన్‌ను మళ్లీ గెలిపించాలి

చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయరాజు

చింతలపూడి: ప్రతిఒక్కరి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించాలని చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు అన్నారు. చింతలపూడి పట్టణంలో శుక్రవారం నాగిరెడ్డి గూడెం, బోయగూడెం, చింతలపూడి పట్టణంలో పలు గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక పార్టీ వైసిపి అని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పరిపాలన సాగిస్తున్నారని కొనియాడారు. చింతలపూడి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి జగ్గవరపు జానకి రెడ్డి, జడ్‌పిటిసి మోలుగుమాటి నీరజ సుధాకర్, చింతంపల్లి సర్పంచి రామకృష్ణ పాల్గొన్నారు.

దళితులకు భూమి అప్పగించాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్

మండవల్లి: దళితుల భూమి దళితులకు అప్పగించి న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సింగనపూడిలో శుక్రవారం జరిగిన భూ బాధితుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగనపూడి గ్రామానికి చెందిన 20 దళిత కుటుంబాలకు 15.59 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇవ్వగా 1925 నుంచి ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ పేరుతో దళితులు సాగు చేసుకుంటూ జీవనం సాగించేవారని చెప్పారు. 1992లో చెర్వు లీజుపేరుతో భూమిలోకి వచ్చిన కైకలూరుకు చెందిన పెత్తందారుడు మాడపాటి కృష్ణప్రసాద్ దళితులను భూమిలోకి రానివ్వకపోవడంతో 2016 నుంచి అధికారుల చుట్టూ దళితులు తిరుగుతున్నా భూ సమస్య పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో భూ కేసు నడుస్తుండగా తుది తీర్పు ఇచ్చేవరకు భూమిలో ఇరుపక్షాలు వెళ్లకుండా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆదేశాలను ధిక్కరించి పెత్తందారుడు దళితులపై దౌర్జన్యం చేసి, చేపలు సాగు చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. దళితులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సిపిఎం అండగా నిలబడుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ సభ్యులు పకిరి దావీదు పాల్గొన్నారు.

డయాలసిస్ బాధితునికి పెన్షన్

ముదినేపల్లి: మండలంలోని పేరూరు సచివాలయం పరిధిలో నూతనంగా మంజూరైన డయాలసిస్ పెన్షన్ రూ.10 వేలును వైసిపి నాయకులు శుక్రవారం లబ్ధిదారునికి అందజేశారు. గ్రామానికి చెందిన వీర్ల వెంకటరత్నం కొంతకాలంగా డయాలసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణకు గ్రామస్తులు తెలియజేశారు. ఆయన వెంటనే ఎంఎల్‌ఎ డిఎన్ఆర్ దృష్టికి తీసుకువెళ్లి మూడు రోజుల్లోనే పెన్షన్ మంజూరు చేయించారు. ఈ పెన్షన్‌ను సత్యనారాయణ వైసిపి నాయకులతో కలిసి వెళ్లి ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారునికి అందించారు. ఈ కార్యక్రమంలో కలిదిండి ఎఎంసి వైస్ ఛైర్మన్ బత్తిన కిషోర్, దాకరం పిఎసిఎస్ ఛైర్మన్ సోమా సత్యనారాయణ, పెద్దిబోయిన రామ్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

జంగారెడ్డిగూడెం టౌన్: మండలంలోని పేరంపేట గ్రామంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును విని గుండెపోటుతో మరణించిన టిడిపి వీరాభిమాని భీమడోలు వెంకయ్య కుటుంబానికి ఎన్‌టిఆర్ ట్రస్ట్ ద్వారా రూ.3 లక్షల చెక్కును వారి కుమారులు భీమడోలు రమేష్, రాంబాబులకు చింతలపూడి నియోజకవర్గ టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ అందజేశారు. అలాగే పేరంపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న సిఎస్ఐ చర్చిలకు సొంగ రోషన్ కుమార్ రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కుక్కలు మాధవరావు పాల్గొన్నారు.

'పల్స్ పోలియో'పై అవగాహన

చింతలపూడి : మన దేశంలో పోలియో నిర్మూలించినప్పటికీ మరలా తిరిగి పోలియో వ్యాధి వ్యాపించకుండా ముందస్తుగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని చింతలపూడి విద్యాశాఖ అధికారి కిరణ్ బాబు అన్నారు. మండలంలోని ఎంఇఒ కార్యాలయం వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సిబ్బందితో ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమం గురించి శుక్రవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పిల్లవాని దగ్గర నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఖచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలని, అందుకు ప్రజలంతా తమ వంతు సహాయసహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యకమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలు: పిల్లల ఆరోగ్య పరిరక్షణకు అర్హులైన ప్రతి ఒక్కరికి పల్స్ పోలియో చుక్కలు వేయాలని జెఎంఎం పురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎం.సుధాకర్ కోరారు. ఈ నెల 3వ తేదీన ఆదివారం చేపట్టనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై పాఠశాలకు చెందిన విద్యార్థులతో, యాజమాన్యం, ప్రధానోపాధ్యాయురాలు ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు.

నూజివీడు రూరల్: నిండు జీవితానికి రెండు చుక్కలు ఎంతో ప్రాముఖ్యమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి అన్నారు. నూజివీడు పట్టణంలో పల్స్‌పోలియోపై శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్, చిన్న గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

2024 ఎన్నికల్లో టిడిపి విజయమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి పట్టణంలోని టిడిపి కార్యాలయంలో పార్టీ బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లో తీసుకెళ్లేందుకు ఆరుగురు సభ్యులతో సోషల్ మీడియా వింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలు అధికార పార్టీ ప్రజలను మోసం చేసే విధానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. రెండు నెలలు కష్టపడితే విజయం మనదేనన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో టిడిపి, జనసేనను గెలిపించి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, కి బహుమతిగా ఇవ్వాలని అన్నారు. అందరం కలిసికట్టుగా ప్రయాణం చేద్దామని, కష్టపడి విజయం సాధించుకుందామని తెలిపారు. సూపర్ సిక్స్‌ని ప్రజల వద్దకు తీసుకువెళ్లాలని, పోలింగ్ బూత్ లెవెల్లో ప్రతి ఒక్కరు కష్టపడాలని సూచించారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం : జెడ్‌పిటిసి సూరిబాబు

టి.నరసాపురం: మండలంలోని మర్రిగూడెంలో గురువారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంతో నిరాశ్రయులైన బాధిత కుటుంబానికి జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు (సూరిబాబు) చేతుల మీదుగా శుక్రవారం రూ.5 వేలు ఆర్థిక సహాయంతో పాటు ఇంటి సామగ్రి అందజేశారు. మర్రిగూడెం గ్రామానికి చెందిన కురసం చంద్రావతి భర్త వెంకటేశ్వరరావుకి చెందిన తాటాకిల్లు విద్యుత్ ప్రమాదంలో దగ్ధమై పూర్తిగా నిరాశ్రయులయ్యారు. ఈ ప్రమాదంలో రూ.4 లక్షల నగదు, బంగారు, వెండి ఆభరణాలు, ఇంటి పత్రాలు, పొలం పట్టాలు, బ్యాంకు ఖాతా పుస్తకాలు దగ్ధం కావడంతో విషయం తెలుసుకున్న జెడ్‌పిటిసి సభ్యులు సూరిబాబు, ఇతర వైసిపి నాయకులు బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని సౌకర్యాలు అందిస్తామని, కాలిపోయిన పత్రాలన్ని సచివాలయం ద్వారా మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దారబోయిన లక్ష్మి, వెంకటేశ్వరరావు, సర్పంచి సోయం బిందు, వైసిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర కన్వీనర్ కురసం నిరీక్షనరావు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

పోలవరం :మత్స్య శాఖలో పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన 2021-22 పథకంలో భాగంగా 40 శాతం సబ్సిడీతో రూ.23 లక్షలు విలువ చేసే నాలుగు చక్రాల చేపలు రవాణా వాహనాన్ని ఎంఎల్‌ఎ శుక్రవారం పట్టిసీమ గ్రామానికి చెందిన కామిశెట్టి నాగరాజుకు అందజేశారు. మండలంలోని పలు గ్రామాలలో నూతన భవనాల ప్రారంభోత్సవాల కార్యక్రమంలో ఎంఎల్‌ఎ, నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ పాల్గొన్నారు. మండలంలో పలుగ్రామాలైన కొండ్రుకోట గ్రామంలో నూతన సచివాలయ భవనం, హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, షాపింగ్ కాంప్లెక్స్, గ్రామ సచివాలయం, వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకట్ రెడ్డి, తహశీల్దార్ ప్రసాద్, ఎంపిడిఒ జి.శ్రీను పాల్గొన్నారు.

ముదినేపల్లి : ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా మండలంలోని శ్రీహరిపురం, సింగరాయపాలెం గ్రామాల సచివాలయాల పరిధిలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభోత్సవాలు చేశారు. మండలంలోని చేవూరుగూడెంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయిన్లను ప్రారంభించారు. అనంతరం కాకరవాడ శివారు దేవరం, సింగరాయపాలెం, శ్రీహరిపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లను ప్రారంభించారు. పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఏలూరు 1వ అదనపు జిల్లా కోర్టు, ఏలూరు

ఇ.పి. నెం. 751/2021 ఇన్ ఎ.ఆర్.సి. నెం. 160/2021

బిట్వీన్:
మెస్సర్స్ శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, తాడేపల్లిగూడెం -డి. హెచ్. ఆర్.
మరియు
రుట్టల వి.ఎల్.నరసింహారావు మరియు యితరులు -జె.డి.ఆర్స్

యిందు పై నెంబరు ఇ.పి. గ్రంధములో ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని పై కోర్టులో వేలం వేయబడును. యావన్మంది పాటలో పాల్గొనవచ్చును. వేలము **ది. 21-03-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి యెదుట వేలం వేయబడును. పబ్లికేషన ద్వారా తెలియపర్చడమైనది.

షెడ్యూలు

West Godavari District, Bhimadole Sub-Registry, Rallakunta Village, R.S. No. 31, a plot an extent of 300.0.0. sq.yds. is bounded by: **EAST:** Road - 45'-0". **SOUTH:** Puntha - 60'-0". **WEST:** Site of Smt. Tandra Rama Devi - 45'-0". **NORTH:** Site of plot No. 19 - 60'-0"

With all easementary rights over the schedule immovable property for ingress or egress.

DHR Value Rs. 4,00,000/-
Amin Value Rs. 18,00,000/-
(1వ అదనపు జిల్లా కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

K.V.S.N.R.GOPAL, Advocate
Eluru, Cell: 9949885456

NAME CHANGE

I, Perumalla Radha Krishna S/o P. Sri Rama Chandra Murthy. R/o D.No. 15-5-5, Paluru Vari Street, Maruthi theatre Center , Bhimavaram - 534201, West Godavari Dt. A.P India. have changed my name from PERUMALLA RADHA KRISHNA to PERUMALLA VENKATA RADHA KRISHNA MURTHY on vide affidavit dated 28-02-2024 before Notary.

ఎమర్జన్సీ సర్టిఫికెట్ (EC)పోయినది

RAMANI DURGA అను నాకు BAHRAIN దేశంలోని భారత రాయబార కార్యాలయం అధికారులు ది.13-12-2021న X0533900 నెంబరుగల ఎమర్జన్సీ సర్టిఫికెట్ (EC) మంజూరు చేసారు. సదరు EC జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది. 23-02-2024న పల్లిపాలెం నుండి కాళీపట్నం వెస్టు గ్రామంలో జిరాక్స్ సెంటర్‌కు వెళ్ళుచుండగా నా ఒరిజినల్ EC పోయినది. గాన నా ఎమర్జన్సీ సర్టిఫికెట్ (EC)ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అదించగలరని కోరుతున్నాను

RAMANI DURGA
W/o. Ramani Edukondaluo
D.No. 2-50, Pallipalem
Kalipatnam West, Mogaltur Mandal
West Godavari Dist., A.P.

దస్తావేజు పోయినది

నా క్లయింట్ అయిన ఏలూరు జిల్లా, లక్ష్మీపురం గ్రామం, పెదవేగి (మం)కు చెందిన **శ్రీ సూర్రెడ్డి లక్ష్మి వరప్రసాద్, S/o. వెంకటేశ్వరరావు** అను వారు తెలియజేయునది ఏమనగా, వారి యొక్క **ఒరిజినల్ దస్తావేజు నెం. 6403/1986** రు గల తేది. 17-10-1986 గల డాక్యుమెంట్ పెదవేగి గ్రామము నందు జిరాక్స్ తీయించుటకు వెళ్ళుతుండగా మార్గ మధ్యలో పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియచేయగలరు.

E.SRINIVASA BABU
Advocate, ELURU
Ph: 08812-239498

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, వీరవాసరం మండలం, నందమూరు గరువు, డోర్ నెం. 2-82/ఎ కు చెందిన పాలపర్తి వినోద్, S/o. బాబూరావు అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. **T2482500,** ది. 5-2-2024వ తేదీన నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టును జిరాక్స్ తీయించుకొనుటకు నా గ్రామం అయిన నందమూరు గరువు నుండి వీరవాసరం నా యొక్క మోటార్ సైకిల్‌పై వెళ్ళుచుండగా మధ్యలో పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

పాలపర్తి వినోద్
S/o. బాబూరావు, డోర్ నెం. 2-82/ఎ,
నందమూరు గరువు, వీరవాసరం మండలం,
ప॥గో॥జిల్లా, సెల్: 9989667147

In the Court of the Addl. Senior Civil Judge, Eluru
E.P. 10/2029, O.S. 55/2013

Between:
వేల్పుల వెంకటేశ్వరరావు ...D.Hr
AND
దేవు నాగరాజు, S/o. రామారావు, విద్యుత్ నగర్ కాలనీ, వట్లూరు, పెదపాడు మండలం. ...J.Dr

వేలము నోటీసు

పై నంబరు దావా గ్రంధములోని D.Hr తన బాకీని వసూలు చేసుకునే నిమిత్తం దాఖలు చేసిన ఈ E.P. గ్రంధములో దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **ది. 15-03-2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట బహిరంగముగా వేలం వేయబడును. వేలంలో పాడుకొనదలచిన వారు ఉదయం 10.30 గం॥లకు ఆధార్ కార్డులతో వచ్చి వేలంలో పాల్గొనవలసినదిగా కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు.

షెడ్యూలు

Landed property in an extent of Ac. 0-10 cts covered by R.S. No. 114/3, situated in Kolaparru Grama Panchayat, Pedapadu Mandalam, Eluru SRO, W.G.Dt., with the following boundaries.

EAST: Land of Kadaganchi Lakshmi. **SOUTH:** Land of Balda Manikyamma. **WEST:** Land of Ramini China Venkateswara Rao. **NORTH:** Land of Vare Veera Swamy.

An extent of Ac. 0-10 cts of land, with all the easementary rights.

D.Hr Value - more than five lakhs.
Amin Value- Rs. 2,33,000/-

Eluru Dt.01-03-2024
S.BRAHMAM, Advocate
Eluru, Cell: 9492932214